క్లుప్తంగా

వైఎస్సార్ పోషకాహార కిట్లు పంపిణీ



పెడన: మండలంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం గర్భిణులకు, బాలింతలకు పోషక పదార్థాలున్న వైఎస్సార్ కిట్లను అందజేశారు. మండలంలోని కొంకేపూడి, చేవేంద్ర, నందిగామ దళితవాడ, కోడూరు, చెన్నూరు, దిరిశవల్లి, నందమూరు, ఉరివి, లంకలకలువ గుంట అంగన్‌వాడీ కేంద్రాల్లో కిట్లను పంపిణీ చేశారు. అనంతరం మలేరియా మాసోత్సవాలు నిర్వహించారు. గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించి పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. చేతులను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు పార్వతి, గీత, కుమారి, మహాలక్ష్మి, నాగలక్ష్మి, సరోజ, కోటేశ్వరమ్మ, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

ఉప్పాల రాంప్రసాద్‌కు ఎంపీ బాలశౌరి పరామర్శ



చిలకలపూడి(మచిలీపట్నం): ఉమ్మడి కృష్ణా జిల్లా డీసీఎంఎస్ మాజీ చైర్మన్, వైఎస్సార్ సీపీ నాయకుడు ఉప్పాల రాంప్రసాద్‌ను బందరు పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలశౌరి శుక్రవారం పరామర్శించారు. అనారోగ్యంతో బాధపడుతూ విజయవాడలోని ఆంధ్రా హాస్పటల్‌లో చికిత్స పొందుతున్న ఆయనను బాలశౌరి పరామర్శించారు. రాంప్రసాద్ ఆరోగ్యం గురించి వైద్యులను ఆయన అడిగి తెలుసుకున్నారు.

స్వాహా సొమ్ము రికవరీ చేయాలి

నాగాయలంక: వక్కపట్లవారిపాలెం శివారు ఎన్టీఆర్ కాలనీకి చెందిన వీఓఏ గాజులేటి షాలినీ స్వాహా చేసిన సొమ్మును ఆమె నుంచి రికవరీ చేసి బాధితులకు న్యాయం చేయాలని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి చింతపల్లి దాసు ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. డ్వాక్రా సభ్యులను మోసం చేసి పొదుపు సొమ్ము రూ.21 లక్షలు షాలినీ స్వాహా చేసిందన్నారు. ఈ కేసులో నిందితురాలిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చి జైలుకు పంపిన నాగాయలంక ఎస్ఐ ఎం.సుబ్రహ్మణ్యంను అభినందించారు.

సచివాలయాల ఆకస్మిక తనిఖీ



పెడన: మండలంలోని సచివాలయాల డేటా ఎంట్రీ ఆపరేటర్లు, గ్రేడ్–5 పంచాయతీ కార్యదర్శులతో ఎంపీడీఓ వి. రెడ్డయ్య శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఆయా సచివాలయాల పనితీరు, సిబ్బంది హాజరు, పోస్టుల ఖాళీలు తదితర విషయాలపై ఆరా తీశారు. వివిధ పథకాల అర్హుల జాబితాల ప్రదర్శన, ఆయా జాబితాలు సిద్ధంగా ఉన్నది, లేనిది అడిగి తెలుసుకుని పలు సూచనలు చేశారు. మధ్యాహ్నం మండలంలోని బల్లిపర్రు గ్రామ సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అటెండెన్సు రిజిస్టర్లను, సిబ్బంది మూమెంట్ రిజిస్టర్లను పరిశీలించారు. సిబ్బంది పనితీరు మరింత మెరుగుపరుచుకోవాలని ఎంపీడీఓ సూచించారు.

మజ్జిగ పంపిణీ



పెడన: జయలక్ష్మీ పీఏసీఎస్ త్రిమెన్ కమిటీ చైర్మన్ వరుదు రామకృష్ణ ఆధ్వర్యంలో తోట మూల సెంటర్ వద్ద శుక్రవారం మజ్జిగ పంపిణీ చేశారు. పాదచారులు, వాహన చోదకులకు మజ్జిగ అందజేశారు. రామకృష్ణ, ఉమాదేవి దంపతులు పాల్గొన్నారు.

నేటి నుంచి అంకమ్మ తల్లి జాతర

రావివారిపాలెం(మోపిదేవి): రావివారిపాలెంలోని అంకమ్మ తల్లి జాతర మహోత్సవం శని, ఆదివారాల్లో నిర్వహిస్తామని కమిటీ సభ్యులు తెలిపారు. శనివారం ఉదయం ఊరేగింపుగా బయలు దేరి మోపిదేవివార్పు వద్ద కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించి మోపిదేవి మునస్వమ్మ అమ్మవారి ఆలయం వద్దకు చేరుకుంటుందని చెప్పారు. అక్కడి నుంచి మేళతాళాలు, డప్పు కళాకారుల సందడితో గొడపాలెం, గొల్లపాలెం మీదుగా రావివారిపాలెం నూకాలమ్మ గుడి వద్దకు చేరుకుని అక్కడ జాతర కొనసాగుతుందన్నారు. అనంతరం అంకమ్మ తల్లి ఆలయానికి ఊరేగింపుగా చేరుకుంటుందని, ఆదివారం ఉదయం గ్రామస్తులు ముఖ్యంగా మహిళలు సంప్రదాయబద్ధంగా నూకాలమ్మ గుడి వద్దకు సారె తీసుకు వెళ్లి నైవేద్యాలు సమర్పిస్తారని చెప్పారు.

అన్నదాతలకు ఆర్బీకేలు వెన్నుదన్ను




బందరు మండలం గోకవరం రైతు భరోసా కేంద్రం



ఆర్‌బీకేల ద్వారా రైతులకు సబ్సిడీ విత్తనాలను పంపిణీ చేస్తున్న వ్యవసాయ శాఖాధికారులు (ఫైల్)

- గడిచిన నాలుగేళ్లలో రైతులకు విశేష సేవలు
- సొంత ఊరిలోనే ఎరువులు, విత్తనాల పంపిణీ
- యంత్ర పరికరాలతో సహా అన్ని పథకాలు రైతులకు చేరువ చేసిన ప్రభుత్వం

కోనేరుసెంటర్: గతంలో రైతులు అన్నా, రైతుల కష్టాలు అన్నా ఎవరికీ, ఏ ప్రభుత్వానికి పట్టేది కాదు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతుల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తూ వారికి వెన్నుదన్నుగా నిలుస్తున్నారు. రైతుల కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి వారి అభ్యున్నతికి చర్యలు చేపట్టారు. దీనిలో భాగంగానే విత్తనం మొదలుకొని పంటచేతికి వచ్చి మద్దతు ధర పొందేవరకు అన్నదాతలకు అండగా నిలిచేలా రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రభుత్వం అమలు చేసే ప్రతి పథకాన్ని వీటి ద్వారా రైతులకు చేరువ చేస్తున్నారు. వ్యవసాయ పరంగా రైతులకు ఎలాంటి సమస్యలు వచ్చినా తమ వంతు సేవలను ఆర్‌బీకేలు అందిస్తున్నాయి. దేశంలో ఇప్పటి వరకు ఏ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేయని విధంగా రైతు భరోసా కేంద్రాలను ప్రారంభించి ఇతర రాష్ట్రాలకు ఆంధ్రప్రదేశ్ ఆదర్శంగా నిలిచేలా సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నిర్ణయం తీసుకున్నారు. వాటి ద్వారా సొంత గ్రామాల్లోనే రైతులకు అన్ని సేవలు అందజేస్తున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించిన రైతు భరోసా కేంద్రాలు నాలుగేళ్లలో రైతు నేస్తాలుగా మారడంతో రైతులు ముఖ్యమంత్రి నిర్ణయంపై హర్షాతిరేకం వ్యక్తం చేస్తున్నారు.



ఆర్‌బీకేల ద్వారా అన్ని రకాల సేవలు ..

గతంలో రైతులకు వ్యవసాయపరంగా ఎలాంటి అవసరం వచ్చినా మండల కేంద్రంలో ఉండే వ్యవసాయ శాఖ కార్యాలయానికి వెళ్లాల్సి వచ్చేది. ఇందు కోసం వ్యయప్రయాసలకు గురయ్యేవారు. కూలి మానుకుని మండల కేంద్రానికి వెళ్లాల్సి వచ్చేది. ప్రయాణ ఖర్చులు, భోజనం ఖర్చులు అయ్యేవి. ప్రస్తుతం ప్రతి గ్రామంలోనూ ఆర్బీకేలు ఏర్పాటు చేయడంతో రైతులు తమ సొంత ఊళ్లలోనే అన్నిరకాల సేవలు పొందుతున్నారు. ఖర్చులు తగ్గాయి.

కియోస్కో యంత్రం ద్వారా ప్రయోజనాలు

ఆర్‌బీకేల్లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన కియోస్కో యంత్రాల ద్వారా రైతులకు ఎన్నో రకాలుగా మేలులు జరుగుతున్నాయి. రైతులకు కావాల్సిన అన్ని రకాల సబ్సిడీ ఎరువులు, విత్తనాలు 48 గంటల్లోనే నేరుగా రైతులకు అందుతున్నాయి.

ఈ క్రాప్ బుకింగ్, పంట నష్ట పరిహారం

ప్రతి రైతు తాను సాగు చేసిన పంటలకు సంబంధించి ఈ క్రాప్ బుకింగ్ చేసుకొంటున్నాడు. తద్వారా విపత్తులు సంభవించినప్పుడు పంటలు నష్టపోతే ప్రభుత్వం నుంచి నష్టపరిహారం పొందే అవకాశం కలుగుతోంది. ఈ క్రాప్ ద్వారా పంట నమోదు చేయించుకున్న రైతులకు నష్టం జరిగితే బ్యాంకులు రైతులకు పంట రుణాలను అందజేస్తున్నాయి.

నాలుగేళ్లుగా రైతు భరోసా వస్తోంది



ఆర్బీకేల ద్వారా నాకు నాలుగేళ్లుగా రైతు భరోసా వస్తోంది. ముఖ్యంగా ఖరీఫ్ సీజన్లో ప్రభుత్వం ఇచ్చే రైతు భరోసా డబ్బు పంటల సాగుకు ఎంతో ఉప యోగపడుతోంది. రైతు కష్టాలను అర్థం చేసుకునే ముఖ్యమంత్రి మన రాష్ట్రానికి ఉండడం మనమంతా చేసుకున్న అదృష్టం.

– కొక్కిలిగడ్డ వాకలమ్మ, తాళ్లపాలెం

సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం



ప్రతి ఏడాది ఖరీఫ్, రబీ సీజన్లో చేపట్టే ఈ క్రాప్ నమోదు మాకు ఎంతగానో ప్రయోజనం చేకూరుస్తోంది. ప్రకృతి వైపరీత్యాలతో పంటకు నష్టం జరిగితే పంటల బీమా పథకం కింద నష్ట పరిహారం చెల్లిస్తున్నారు. రైతుల కోసం కష్టపడుతున్న సీఎంకు జగనన్నకు రుణపడి ఉంటాం.

– నీలకంఠం వీరాంజనేయులు, పోతేపల్లి

పలువురికి మంత్రి జోగి రమేష్ పరామర్శ

పెడన: పట్టణంతో పాటు మండలంలోని పలువురు కార్యకర్తలను, అభిమానులను రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ పరామర్శించారు. శుక్రవారం ఆయన పట్టణంలోని 17వ వార్డుకు చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు హఫీజ్‌ఖాన్ హజ్ యాత్రకు వెళ్లనున్న నేపథ్యంలో ఆయనను కలిసి సత్కరించి అభినందించారు. హజ్‌యాత్ర విజయవంతంగా కొనసాగాలని మంత్రి ఆకాంక్షించారు. మంత్రి జోగి రమేష్ వ్యక్తిగత కారు డ్రైవర్ పరసా బాబీ ఇటీవల శస్త్రచికిత్స చేయించుకోవడంతో అతన్ని పరామర్శించారు. మండలంలోని గురువిందగుంట గ్రామానికి చెందిన పార్టీ కార్యకర్త ఉప్పాల రవి గుండెపోటుతో మరణించడంతో ఆ కుటుంబ సభ్యులను పరామర్శించారు. పిల్లలను బాగా చదివించాలని, పిల్లల చదువు విషయంలో అన్ని విధాలుగా అండగా ఉంటానని చెప్పారు. మున్సిపల్ వైస్ చైర్మన్ ఎండీ ఖాజా, కౌన్సిలర్లు బళ్ల గంగయ్య, మెట్ల గోపీ, నాయకులు బండారు మల్లి, కొండవీటి నాగబాబు, వెంకట రామానాయుడు తదితరులు పాల్గొన్నారు.



హఫీజ్‌ఖాన్‌ను సత్కరించిన మంత్రి జోగి రమేష్ తదితరులు

మార్కెటింగ్‌కు అనువైన వంగడాలను సాగు చేయండి

పెడన: రైతులు అధిక దిగుబడులు సాధించేందుకు మార్కెటింగ్ అనువైన వరివంగడాలను మాత్రమే సాగు చేసి అధిక లాభాలు పొందాలని పెడన వ్యవసాయ సలహా సంఘ చైర్మన్ కాగిత వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం స్థానిక పెడన మార్కెట్ కమిటీ సమావేశం హాల్‌లో పెడన మండల వ్యవసాయ సలహా సంఘ సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ వ్యవసాయ శాఖాధికారులు ఎంటీయూ 1061 (ఇంద్ర), 7029 (స్వర్ణ), 1140 (భీమా), 1172 (క్షీర), 1224 (మార్టేరు సాంబ), 1262 (గోదావరి సాంబ), 1190 (వరం), బీపీటీ 5204 (సాంబ మసూరి), 2782 (భవతి), 2595 (తేజ) ఎంసీఎం 100 (పాండురంగ), 103, 125 రకాలను సూచించారన్నారు. వీటిని విత్తన శుద్ధి చేసి వాడుకుంటే మంచి దిగుబడులు ఇస్తాయని చెప్పారు. రైతులు వ్యవసాయ శాఖాధికారులను సంప్రదించి మట్టి నమూనా పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఏఓ మాట్లాడుతూ వీఏఏలు మట్టి నమూనా పరీక్షలకు నిర్దేశించిన లక్ష్యాలు సాధించాలన్నారు. సంఘ సభ్యులు రాజులపాటి అచ్యుతరావు, గరికిపాటి వెంకట రామానాయుడు, కొండవీటి నాగబాబు, ఎంపీడీఓ వి. రెడ్డయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

ఈ–చలానాలపై స్పెషల్ డ్రైవ్

కోడూరు: వాహనాలపై పెండింగ్‌లో ఉన్న ఈ–చలానాలను కట్టించేందుకు పోలీసులు శుక్రవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. స్థానిక ప్రధాన సెంటర్‌లో ఎస్ఐ వి.రాజేంద్రప్రసాద్ పర్యవేక్షణలో సిబ్బంది వాహన తనిఖీలు చేశారు. వాహనాలకు సంబంధించిన పత్రాలను పరిశీలించారు. వాహనాలపై గతంలో ఉన్న పెండింగ్ చలానాలను పరిశీలించి వాటిని ఆన్‌లైన్ ద్వారా కట్టించారు. వాహన చోదకులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని ఎస్ఐ సూచించారు. ఏఎస్ఐ ఆంజనేయులు, సిబ్బంది పాల్గొన్నారు.



పెండింగ్ చలానాలను పరిశీలిస్తున్న ఎస్ఐ రాజేంద్రప్రసాద్

పైడమ్మ అమ్మవారి ఉత్సవ విగ్రహ ప్రతిష్ఠ ప్రారంభం

పెడన: పట్టణంలోని పైడమ్మ అమ్మవారి ఆలయంలో నూతన ఉత్సవ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం శుక్రవారం వైభవంగా ప్రారంభమైంది. ఆలయ ఈఓ తిక్కిశెట్టి మోహనరావు ఆధ్వర్యంలో ఉదయం వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారికి అగ్ని ప్రతిష్ఠాపన, మూల మంత్రహవనం, శ్రీసూక్త హోమం, ధాన్యాధివాసం, పుష్పాదివాసం, నీరాజన మంత్రపుష్పం, అభిషేకాలు, తీర్థప్రసాదాల వినియోగం చేశారు. భక్తులు పూజల్లో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. శనివారం ఉదయం 7.35 గంటలకు విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ, అనంతరం పూర్ణాహుతి జరుగుతుందని ఈఓ తెలిపారు.



పైడమ్మ అమ్మవారికి అభిషేకాలు చేస్తున్న భక్తులు

విద్యుత్ విజిలెన్స్ అధికారుల తనిఖీలు

- విద్యుత్ అధికంగా వాడుతున్న 97 సర్వీసుల గుర్తింపు
- రూ.2,92,000 జరిమానా విధింపు
- అక్రమ విద్యుత్ వినియోగదారులపై చర్యలు

పామర్రు: మండల పరిధిలో శుక్రవారం విద్యుత్ విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేపట్టారు. మండలంలోని 26 గ్రామాల్లో సర్వీసులను 43 బృందాలు తనిఖీలు చేపట్టారు. అనంతరం స్థానిక కార్యాలయంలో విద్యుత్ విజిలెన్స్ ఈఈ కే వెంకటేశ్వర్లు వివరాలను వెల్లడించారు. పామర్రు మండలంలోని అన్ని గ్రామాలను 43 బృందాలుగా 2,223 సర్వీసులను తనిఖీలు చేశామన్నారు. విద్యుత్ అధికంగా వాడుతున్న 97 సర్వీసులను గుర్తించి అపరాధపు రుసుముగా రూ.2,92,000 విధించామని తెలిపారు. వీటిలో గృహ వినియోగదారులు 89 మందికి రూ.2.76 లక్షలు, వాణిజ్య సర్వీసులు కలిగిన 8 మందికి రూ.16 వేలు అపరాధపు రుసుము విధించామని వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్రమంగా విద్యుత్ వినియోగిస్తూ ప్రభుత్వానికి నష్టం కలిగిస్తున్న వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. మచిలీపట్నం డివిజన్ పరిధిలో విద్యుత్ తనిఖీలను ప్రారంభించామని తెలిపారు. ఈ తనిఖీల్లో మచిలీపట్నం ఆపరేషన్ ఈఈ ఎం.భాస్కరరావు, పామర్రు ఆపరేషన్ డీఈఈ కె.సుందరరావు, పామర్రు ఆపరేషన్ ఏఈ కె.మోహనకృష్ణ, మచిలీపట్నం డివిజన్‌లోని డీఈఈలు, ఏఈలు, లైన్ ఇన్స్పెక్టర్లు, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విద్యుత్‌శాఖ ఈఈ వెంకటేశ్వర్లు తదితరులు

పాల ఉత్పత్తిదారులకు సన్మానం

గూడూరు: పాల ఉత్పత్తిదారుల అభ్యున్నతికి కృష్ణా మిల్క్ యూనియన్ కృషి చేస్తోందని చైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు. గూడూరు మండలం గంటలమ్మపాలెం పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయక సహకార సంఘ రైతులతో చైర్మన్ చలసాని ఆంజనేయులు శుక్రవారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పాల ఉత్పత్తిదారులు మేలైన యాజమాన్య పద్ధతులు, మెరుగైన పశుపోషణ నిర్వహించడం ద్వారా అధిక పాల ఉత్పత్తులు సాధించవచ్చన్నారు. పాల ఉత్పత్తిదారుల సంక్షేమానికి కృష్ణామిల్క్ యూనియన్ అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని వివరించారు. మిల్క్‌యూనియన్ సభ్యుడు అర్జా వెంకట నగేష్, గుడ్లవల్లేరు మేనేజర్ తోట సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాల ఉత్పత్తిదారులను సత్కరించారు.



పాల ఉత్పత్తిదారులను సత్కరిస్తున్న చలసాని ఆంజనేయులు

మండల పరిషత్ సమావేశం వాయిదా

పెడన: పెడన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం జరగాల్సి ఉండగా అనివార్య కారణాల వల్ల ఈనెల 13వ తేదీకి వాయిదా పడిందని ఎంపీడీఓ వి. రెడ్డయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు సమావేశం జరుగుతుందన్నారు. సభ్యులు, సంబంధిత శాఖాధికారులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

ఏపీఆర్‌జేసీలో జెడ్పీ విద్యార్థికి స్టేట్ ర్యాంకు

కోడూరు: ఆంధ్రప్రదేశ్ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలల్లో అడ్మిషన్ల కోసం నిర్వహించిన ఏపీఆర్‌జేసీ ఎంట్రన్స్ టెస్ట్‌లో కోడూరుకు చెందిన విద్యార్థి స్టేట్ ర్యాంకు సాధించాడు. స్వతంత్రపురం జెడ్పీ పాఠశాలలో పదో తరగతి పూర్తిచేసిన ఈర్ల ధనశేఖర్ స్టేట్ 218 ర్యాంక్ కైవసం చేసుకున్నాడు. పదో తరగతి పరీక్షలు పూర్తి కాగానే కోడూరు మెయిన్ ఎంపీయూపీ పాఠశాలలో ఏపీఆర్‌జేసీ ఎంట్రన్స్ టెస్ట్‌కు సంబంధించి ఉచిత శిక్షణ తరగతులను పాఠశాల ఉపాధ్యాయుడు కాశీభొట్ల నాగభూషణం నిర్వహించారు. ఇక్కడ శిక్షణ పొందిన ధనశేఖర్‌కు స్టేట్ ర్యాంకు రావడంతో నాగభూషణం అతడిని అభినందించారు.

విద్యార్థులకు సన్మానం

పమిడిముక్కల: ప్రభుత్వ బడుల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆణిముత్యాలను అందిస్తున్నారని సర్పంచ్ జంపాన ధనలక్ష్మి అన్నారు. మండలంలోని తాడంకి జెడ్పీ పాఠశాలలో పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన ఈడే శ్యామలరేఖ, జలసూత్రం హేమంత్‌లను ఏసుక్రీస్తు ఆది అపోస్తుల సంఘంలో పాస్టర్ ఏసురత్నం ఆధ్వర్యంలో విద్యార్థులకు సన్మాన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. పదో తరగతి విద్యార్థులతో పాటు గ్రామంలో వివిధ తరగతుల్లో కొనసాగుతున్న విద్యార్థులు ప్రగతి సాధించాలని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సర్పంచ్ ధనలక్ష్మి, పాస్టర్ ఫెలోషిప్ అధ్యక్షుడు మాచవరపు రాజేష్ విద్యార్థులను సత్కరించి అభినందించారు. అనంతరం జిల్లాలో ఉత్తమ గ్రామ పంచాయతీ అవార్డు అందుకున్న సందర్భంగా సర్పంచ్ ధనలక్ష్మిని సంఘ సభ్యులు ఘనంగా సన్మానించారు.



విద్యార్థులను అభినందిస్తున్న సర్పంచ్ ధనలక్ష్మి, ఫెలోషిప్ అధ్యక్షుడు రాజేష్

జన జాగృతి సభను విజయవంతం చేయాలి

మొవ్వ: విజయవాడ జింఖానా గ్రౌండ్స్‌లో జులై 7వ తేదీన ఎమ్మార్పీఎస్ 29వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నిర్వహించే మాదిగల జనజాగృతి సభను విజయవంతం చేయాలని పామర్రు నియోజకవర్గ కన్వీనర్ కనగాల వెంకటరత్నం మాదిగ పిలుపునిచ్చారు. మొవ్వ బస్టాండ్ ప్రాంగణంలో మాదిగల చైతన్య కమిటీలు బలోపేతంలో భాగంగా మొవ్వ మండల సభను శుక్రవారం నిర్వహించారు. ఈ మేరకు కర పత్రాలను ఆవిష్కరించి పంపిణీ చేశారు.

జగనన్న గోరుముద్ద రేషన్ తీసుకువెళ్లండి

పెడన: పాఠశాలలు పునః ప్రారంభం 12వ తేదీకి సంబంధించి సంబంధిత ప్రధానోపాధ్యాయులు, ఎంఈఓలు జగనన్న గోరు ముద్ద అమలవుతున్న పాఠశాలల ఇండెంట్ ప్రకారం రేషన్ దుకాణాల నుంచి బియ్యం, రాగిపిండి, బెల్లం తీసుకోవాలని డీఈఓ తాహెరాసుల్తానా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధానోపాధ్యాయులు అందుబాటులో లేకపోతే సంబంధిత వంట ఏజెన్సీవారు బయోమెట్రిక్ వేసి శనివారం తీసుకుని పాఠశాలలో సిద్ధంగా ఉంచాలని స్పష్టం చేశారు. 12వ తేదీకి తీసుకోని వారిపై సీసీఏ రూల్స్ ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని, ఎంఈఓలు, హెచ్‌ఎంలు ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకోవాలని ఆదేశించారు.

పెన్షనర్ల వితరణ



మచిలీపట్నంటౌన్: 29వ డివిజన్‌కు చెందిన పింఛనుదారు కట్టా కోటేశ్వరమ్మ ఇటీవల మృతిచెందింది. డివిజన్‌లోని తోటి పింఛనుదారులు ఒక్కొక్కరు రూ. 100 చొప్పున సేకరించిన రూ. 44,850 మృతురాలి కుమారుడు సుబ్బారాయుడుకు అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కట్టా కేదారేశ్వరరావు, మాజీ కౌన్సిలర్ యర్రా శ్రీనివాసకుమార్, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

దేశభక్తి గీతాలు, సంగీతంలో శిక్షణ



మచిలీపట్నంటౌన్: నగరంలోని పలు గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాలు శుక్రవారం 33వ రోజు చేరుకున్నాయి. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో విద్యార్థులకు పలు డిజైన్లలో గోరింటాకు పెట్టారు. గాయకురాలు కల్యాణి విద్యార్థులకు దేశభక్తి గీతాలు, సంగీతంపై శిక్షణ ఇచ్చారు. విద్యార్థులతో పుస్తకాలు చదివించి, కథలు చెప్పించి యోగా నేర్పించారు. జీకేలో ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. ఉపాధ్యాయులు ఎం. చింతయ్య విద్యార్థులకు ప్రాణాయామం, ధ్యానంపై శిక్షణ ఇచ్చారు. ఈడేపల్లి శాఖా గ్రంథాలయంలో చిన్నారులు ముగ్గులు పోటీలో పాల్గొని ప్రతిభ చూపారు. ఉప గ్రంథాలయాధికారి ఎంవీడీటీ నగేష్, ఈడేపల్లి శాఖా గ్రంథాలయం నిర్వాహకురాలు వెంకటేశ్వరమ్మ పాల్గొన్నారు.

పాఠశాలలకు చేరిన జగనన్న విద్యా కానుక కిట్లు

మోపిదేవి: రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు అందిస్తున్న జగనన్న విద్యా కానుక కిట్లు మండలంలోని అన్ని పాఠశాలలకు ప్రత్యేక వాహనం ద్వారా చేరాయని ఎంఈఓ కె. రాజ్‌కుమార్ తెలిపారు. స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ పాఠశాలలు ఈనెల 12 తేదీ పునఃప్రారంభమవుతాయని, ప్రారంభం రోజునే విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లు పంపిణీ చేసేందుకు చర్యలు చేపట్టామని వివరించారు.

తహసీల్దార్ కార్యాలయంలో బదిలీలు

పెడన: పెడన తహసీల్దార్ కార్యాలయంలో పనిచేస్తున్న వారితో పాటు వీఆర్వో బదిలీ అయ్యారు. కార్యాలయంలో ఎన్నికల విభాగం సీనియర్ అసిస్టెంట్ బత్తుల శివశంకర్ బంటుమిల్లి తహసీల్దార్ కార్యాలయానికి బదిలీ అయ్యారు. జూనియర్ అసిస్టెంట్ ఝాన్సీరాణి మచిలీపట్నం తహసీల్దార్ కార్యాలయానికి బదిలీ అయ్యారు. మండలంలోని చోడవరం వీఆర్వో నారగం రామకృష్ణ బంటుమిల్లి మండలం పెదతుమ్మిడికి బదిలీ అయ్యారు. వీరిని శుక్రవారం తహసీల్దార్ పి. మధుసూదనరావు, ఆర్ఐ మణికుమార్, డీటీ పూర్ణచంద్రరావు, వీఆర్వోలు ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు.

అవనిగడ్డలో ఈదురు గాలుల బీభత్సం

పడిపోయిన చెట్లు, హోర్డింగులు



అవనిగడ్డ: అవనిగడ్డలో ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. గాలీ దుమారానికి పలు చోట్ల చెట్లు విరిగి పడిపోయాయి. అవనిగడ్డలో ఏర్పాటు చేసిన హోర్డింగులు, ఫ్లెక్సీలు నేలకొరిగాయి. మండల పరిధిలోని పులిగడ్డలో వైస్ ఎంపీపీ పులిగడ్డ పిచ్చేశ్వరరావుకు చెందిన రేకుల షెడ్డు హోరుగాలికి కుప్పకూలిపోవడంతో షెడ్డులో ఉన్న కారు దెబ్బతింది. ఇటుక బట్టీ వేసేందుకు సిద్ధంగా ఉంచిన పచ్చి ఇటుకలపై వర్షం కురిసి ఇటుక ఆవలు పాడైపోయాయి. ఈదురుగాలులకు పలు చోట్ల విద్యుత్ తీగలు తెగిపోవడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది.

పాస్‌పోర్టు పోయినది

జనగం వెంకటరమణ S/o లక్ష్మయ్య, ఏలూరు జిల్లా మండవల్లి (మం.), మండవల్లి గ్రామమునకు చెందిన నాకు సంబంధించిన పాస్‌పోర్ట్‌నెం. B0303428, ఫైలు నెంబరు VSPAO 3472990096. కృష్ణాజిల్లా, మచిలీపట్నం S.P. ఆఫీస్ నుండి చిలకలపూడికి బైక్‌పై వెళుతుండగా మార్గం మధ్యలో పోయినది దొరికినవారు ఈ క్రింది నెంబరుకు తెలియజేయగలరు. తగిన పారితోషికం ఇవ్వబడును.

సంప్రదించండి. : 94407 11444